## పదూళ్లకు గోస



ఎండుతున్న వరిని చూపుతున్న రైతు మంద శ్రీనివాస్

కరీంనగర్, (నమస్తే తెలంగాణ) ఏప్రిల్ 6 : చిగురుమామిడి మండలంలో సాగునీటి గోస వెంటాడుతున్నది. గాగిరెడ్డిపల్లి, లంబాడిపల్లి, కొండాపూర్, గునుకులపల్లి, కొత్తపల్లి, ఉల్లంపల్లి, సుందరగిరి, తదితర గ్రామాల్లో కొరత తీవ్రమవుతున్నది. ప్రధానంగా గాగిరెడ్డిపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో రైతులు అరిగోస పడుతున్నారు. ఇప్పటికే అనేక ఎకరాల్లో పంటలు ఎండిపోగా, మిగిలిన పంటలను కాపాడుకునేందుకు తండ్లాడుతున్నారు. ఇంకో 20 రోజులు నీళ్లు పెడితే పంటలు చేతికి వచ్చే అవకాశముండగా, అప్పటి వరకు పంటలను ఎలా కాపాడేదని ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఏటా పదూళ్లను ఇదే గోస వెంటాడుతున్నదని కంటతడి పెడుతున్నారు. గౌరవెల్లి నుంచి వచ్చే డీ-4 ప్రధాన కాలువను త్వరగా పూర్తి చేస్తేనే నీళ్లు వస్తాయని, తమ కష్టాలు తీరుతాయని చెబుతున్నారు.

## పెన్షన్ బిల్లును ఎదుర్కొందాం

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 6 : పార్లమెంటులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ బిల్లును ఐక్య ఉద్యమాలతో ఎదుర్కొందామని తెలంగాణ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చెట్టి మల్లయ్య పిలుపునిచ్చారు. ఆ సంఘం ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలోని కిసాన్‌నగర్‌లో గల సంఘం జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన జీవితాన్నే ధారబోసిన డీఎస్ నకార పెన్షనర్లకు సాధించి పెట్టిన హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని దుయ్యబట్టారు. పెన్షనర్స్ పౌర సేవల సవరణ బిల్లును వెంటనే రద్దు చేయకపోతే, ఉద్యమాలు చేసేందుకైనా వెనుకాడేది లేదని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా నిరవధిక ఆందోళనలు, ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు మండలాల వారీగా బాధ్యులను ప్రకటించారు. సమావేశంలో పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లాశాఖ ప్రతినిధులు సోమయ్య, ఎండీ రశీద్, మౌనా, చంద్రమౌళి, గబ్బెట వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ వైభోగమే!

## ఊరూరా వైభవంగా సీతారాముల కల్యాణం





వేములవాడ: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, తిలకిస్తున్న శివపార్వతులు



తాళిని చూపిస్తున్న అర్చకుడు

వేములవాడ/ ఇల్లందకుంట, ఏప్రిల్ 6 : అభిజిత్ లగ్న సుముహూర్తాన.. వేదమంత్రాల సాక్షిగా.. అశేష భక్త-జనం సమక్షాన.. ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. శ్రీరామనవమిని పురస్కరించుకొని రాములోరి వివాహ వేడుక ఊరూరా కనులపండువగా సాగింది. వేములవాడ రాజన్న క్షేత్రం, అపరభద్రాద్రి ఇల్లందకుంట రామాలయం, ధర్మపురి నృసింహస్వామి, కొండగట్టు అంజన్న సన్నిధి, గోదావరిఖని కోదండ రాముడి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోగా, వేములవాడలో 'తలువాలు' కార్యక్రమం శివధారణుల్లో తన్మయత్వం నింపింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరిగిన వేడుకలకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఇతర అధికారులు హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు.



ఇల్లందకుంట: పట్టు వస్త్రాలు తీసుకవస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కలెక్టర్, అధికారులు



## చేపల కోసం కొంగల వేట

దూర ప్రాంతాల నుంచి వలస వచ్చిన కొంగలు కడుపు నింపుకునేందుకు కరీంనగర్ శివారులోని ఎల్ఎండీలో ఇలా చేపల వేట చేస్తున్నాయి. జలాశయంలో నీళ్లు తగ్గడంతో ఓ గుంతలో నిలిచిన నీటిలో వందలాది కొంగలు చేపల కోసం గంటల కొద్దీ జపం చేయగా, 'నమస్తే' తన కెమెరాలో బంధించింది.

**- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విద్యానగర్, ఏప్రిల్ 6 : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ ముజాహిద్ హుసేన్ ఒక ప్రకటనలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. ఈహెచ్ఎస్ పెండింగ్ బిల్లులు, 5 డీఏలు రావాల్సి ఉందని తెలిపారు. 317 జీవో ద్వారా ఎంతో మంది ఉద్యోగులు మానసికంగా కుంగి పోతున్నారని, తాము కోరుకున్న చోటికి ఎప్పుడు బదిలీ చేస్తారని ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పీఆర్సీ రిపోర్టును కమిషన్ ద్వారా వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ వేసి ఆరు నెలలు గడుస్తున్నా ఉద్యోగ సంఘాల నాయకులు, జేఏసీ నాయకులతో ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించ లేదని, వెంటనే సమావేశం నిర్వహించి ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ డిమాండ్ చేశారు.















# నేతన్నకు ఏదీ తగిన కూలి?



మూతపడ్డ మరమగ్గాలు

- ఏడాదిన్నర పాలనలో ఆగమాగం
- చీరెల ఆర్డర్లు ఇచ్చినా కూలీ రేట్ల నిర్ణయంపై నిర్లక్ష్యం
- అందని పనికి తగ్గ ఫలితం
- పోరుబాటలో కార్మికులు
- ఆరు రోజులుగా నిరవధిక సమ్మె
- నిలిచిపోయిన మరమగ్గాలు
- నేటి నుంచి నిరాహార దీక్షలు

## కూలీ రేట్లు నిర్ణయించని సర్కారు

నేతన్నకు వేతన భరోసా కరువవుతున్నది. పనికి తగ్గ కూలీ దక్కకుండా పోతున్నది. మహిళా సంఘాల చీరెల తయారీ ఆర్డర్లు ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు, కూలీ రేట్లు నిర్ణయించకుండా మొండిచేయి చూపింది. దీంతో కార్మికులు ఆగ్రహిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న చీరెల తయారీకి కూలీ రేట్లు నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ పోరుబాట పట్టారు. ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో నేటి నుంచి నిరాహార దీక్షలకు సిద్ధమవుతున్నారు.

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పాలనలో జీవం పోసుకున్న వస్త్రపరిశ్రమ, కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో కుదేలైంది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం నాడు కేసీఆర్ హయాంలో ఇచ్చిన బతుకమ్మ చీరెల ఆర్డర్లను నిలిపి వేసింది. దీంతో ఎంతో మంది నేతన్నలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఉపాధి చూపాలంటూ కార్మికులు వేడుకున్నారు. పోరుబాట పట్టారు. దాని ఫలితంగా దిగొచ్చిన కాంగ్రెస్ సర్కారు స్వయం సహాయక సంఘాల మహిళలకు రెండు జతల చీరెల చొప్పున ఇస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో సిరిసిల్ల నేతన్నలకు ₹8కోట్ల విలువైన 1.30కోట్ల చీరెల తయారీ ఆర్డర్లు ఇచ్చింది. ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. యజమానికి మీటరు తయారీకి ₹32.50 చొప్పున చెల్లించేందుకు అంగీకరించినా కార్మికులకు మాత్రం కూలీ రేట్లు నిర్ణయించలేదు. దీంతో పదిహేను రోజులుగా పనిచేస్తున్న కార్మికులకు యజమానులు, ఆసాములు అనామతుగా పైసలు ఇస్తూ వస్తున్నారు. పనికి తగ్గ కూలీ దక్కకపోవడం, దీనిపై టెస్కో అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో కార్మికులు పోరుబాట పట్టారు.

### ఉపాధి ఎవరికి?

కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరెల తయారీకి మీటరుకు ₹34.50 చొప్పున యజమానులకు చెల్లించింది. అందులో కార్మికుడికి ₹5.25, యారన్ సబ్సిడీ ₹1.42పైసలు అదనంగా చెల్లించింది. మీటరుకు అన్ని కలిపి ₹6.67పైసలు చెల్లించేలా చర్యలు తీసుకున్నది. కానీ, ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం యజమానులకు రెండు రూపాయలు తగ్గించి ₹32.50 మాత్రమే చెల్లిస్తున్నది. యజమానులకు ఇచ్చే కూలీ మాత్రం నిర్ణయించినా.. కార్మికుల కూలీ నిర్ణయించకుండా చేతులు దులుపుకున్నది. అసలు చీరెల వల్ల ప్రయోజనం కార్మికులకా..? లేక యజమానులకా..? అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. పైగా బతుకమ్మ చీరెల కన్నా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే చీరెల తయారీలో ఎక్కువ పని ఉంటుందని చెబుతున్నారు. ఎక్కువ పని చేయించి తక్కువ కూలీ వచ్చేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు.

### ఊసేలేని యారన్ సబ్సిడీ

కార్మికక్షేత్రంలో వలసలు తగ్గించేందుకు నాడు కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. కార్మికులకు చేతి నిండా పని కల్పించడంతో పాటు పనికి తగ్గ వేతనం వచ్చేలా చర్యలు తీసుకున్నది. నెలకు ₹20వేలు పొందేలా కూలీ రేట్లు నిర్ణయించింది. ప్రోత్సాహకంగా బతుకమ్మ చీరెలకు ఇచ్చే యారన్‌కు పది శాతం సబ్సిడీ ప్రకటించింది. సబ్సిడీ పైసలు కూడా కార్మికులకే చెల్లించేలా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన చీరెల ఆర్డర్లకు కూలీ నిర్ణయించకపోగా, యారన్ సబ్సిడీ కూడా ప్రకటించలేదు.



బీవైనగర్‌లోని సమ్మె శిబిరంలో నాయకులు, నేతన్నలు

### సమ్మెబాటలో కార్మికులు

ప్రభుత్వం ఇస్తున్న చీరెల తయారీకి కూలీ రేట్లు నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ నేతన్నలు ఉద్యమిస్తూనే ఉన్నారు. అరెస్టులతో భయపెట్టినా.. సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేసినా వెన్నక్కితగ్గకుండా పోరు మరింత ఉధృతం చేస్తున్నారు. ఆరు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. దీంతో వందలాది మరమగ్గాలు బంద్‌పడ్డాయి. చీరెల తయారీ నిలిచి పోయింది. అయినా అధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకోకపోవడంతో కార్మికులు మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేటి నుంచి 24 గంటల నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సీఐటీయూ నాయకులు ప్రకటించారు. సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం పది గంటలకు దీక్షా శిబిరాన్ని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ ప్రారంభిస్తారని జిల్లా అధ్యక్షుడు కోడం రమణ ఒక ప్రకటనలో తెలిపారు.

### పాత కూలీ రేట్లు ఇవ్వాలి



కేసీఆర్ ప్రభుత్వం కార్మికుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసింది. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం, కార్మికుల ఆకలిచావులు, ఆత్మహత్యలను నివారించేందుకు ఆయన అనేక చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా బతుకమ్మ చీరెల తయారీ ఆర్డర్లు ఇచ్చి మెరుగైన కూలీ కార్మికులకు చెల్లించింది. అదనపు కూలీ ఇచ్చేలా యారన్ సబ్సిడీ కూడా ఇచ్చింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నది. చీరెల తయారీ ఆర్డర్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నది. కూలీ రేట్లను నిర్ణయించలేదు. ఇది సరైంది కాదు. నేతన్నల సంక్షేమం కోసం కేసీఆర్ తెచ్చిన పథకాలను యథాతథంగా అమలు చేయాలి. కూలీ రేట్లు బతుకమ్మ చీరెలకు ఇచ్చిన మాదిరిగానే స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇచ్చే చీరెలకు ఇవ్వాలి. వార్పిన్ కార్మికులు, నేతన్నలకు కూలీ మెరుగైన కూలీ రేట్లు నిర్ణయించాలి. వెంటనే చర్యలు తీసుకోక పోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తం.

**- మూషం రమేశ్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు**












# ఎల్ఆర్ఎస్ సొమ్ము బల్దియాలకు దక్కేనా..?



- ఉమ్మడి జిల్లాలో రెగ్యులరైజేషన్‌కు స్పందన
- ఇప్పటివరకు ₹92కోట్ల ఆదాయం
- గతంలో మున్సిపాలిటీల్లోనే జమ
- పట్టణాల అభివృద్ధికి అవకాశం
- ప్రస్తుతం రాష్ట్ర ఖాతాల్లోనే ఫీజులు జమ!
- తిరిగి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి!

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 6: అక్రమ లేఅవుట్ల రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ స్కీంకు కాసుల పంట పండుతున్నది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో విశేష స్పందన వస్తున్నది. మొదట 25శాతం రాయితీ గత నెల 31 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశమిచ్చినా.. తాజాగా ఆ గడువును ఈ నెల 30వరకు పొడిగించింది. దీంతో రోజు రోజుకూ ఆదాయం దండిగా వస్తున్నది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో ఎల్ఆర్ఎస్‌తో ఇప్పటి వరకు ₹92కోట్ల సమకూరాయి. ఈ ఆదాయం మొత్తం ప్రభుత్వ ఖజానాలోనే జమవుతుందని అధికారవర్గాల ద్వారా తెలుస్తుండగా, ఇదేం తీరు అని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ డబ్బులు ఆయా బల్దియా ఖాతాల్లో జమైతే పట్టణాల అభివృద్ధికి మేలు జరుగుతుంది. దశ మారుతుంది. గతంలో ఎల్ఆర్ఎస్ నిధులన్నీ మున్సిపాలిటీలకే చెం దేవి. ఏయే డివిజన్లు, వార్డుల నుంచి నిధులు వచ్చా యో ఆయా డివిజన్లు, వార్డు లో 50 శాతం నిధులను అక్కడ అభివృద్ధికి వ్యయం చేయడంతోపాటు మిగిలిన 50 శాతం నిధులను ఆయా నగర, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి వినియోగించే వారు. కానీ, ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ ఫీజులు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకే వెళ్తున్నట్టు తెలుస్తున్నది. అయితే ఇవి తిరిగి మున్సిపాలిటీలకు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉన్నది. దీంతో ఆయాచోట్ల పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తిరిగి మున్సిపాలిటీలకు ఎప్పుడు మంజూరు చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

### కరీంనగర్‌లోనే అత్యధికం

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ పథకానికి 1.36 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అందులో ఇప్పటి వరకు 28 వేలకు పైగా దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా, సుమారుగా ₹92కోట్ల ఆదాయం వచ్చింది. కరీంనగర్ నగరంలో 29,558 దరఖాస్తులు రాగా, 205 అర్జీలను అధికారులు తిరస్కరించారు. ఇప్పటివరకు 3,786 మంది ఫీజు చెల్లించగా, ₹22.54 కోట్ల ఆదాయం వచ్చింది. ఇక జిల్లాలోని డెవలప్‌మెంట్ అథారిటీలు, మున్సిపాలిటీల్లో చూస్తే మొత్తం 48 వేల దరఖాస్తులు వచ్చాయి. అందులో 9,826 మంది ఫీజు చెల్లించడంతో ₹39.27 కోట్ల ఆదాయం వచ్చింది. జగిత్యాల జిల్లాలోని మున్సిపాలిటీల్లో 32 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు 5,149 మంది ఫీజు చెల్లించగా, ₹14.85 కోట్లు వచ్చాయి. పెద్దపల్లి జిల్లాలో 19 వేలకు పైగా దరఖాస్తుదారుల్లో 5,247 మంది చెల్లించగా ₹20.25 కోట్లు, సిరిసిల్ల జిల్లాలో 36 వేలకు పైగా దరఖాస్తుదారుల్లో 7735 మంది చెల్లించగా ₹17.33 కోట్లు వచ్చాయి. వీటిని నిబంధనల మేరకు ఆయా మున్సిపాలిటీల్లో ఖాతాల్లో జమ చేస్తే పట్టణాల అభివృద్ధికి అవకాశం ఉంటుంది.